వెనక మావారి తలంట్ల దొడ్డమ్మగారు బాగా పెద్దయాక మావారి గదిలోపడుకున్న ఆయన ఫ్రండుని రెక్క పుచ్చుగు బలవంతాన లాక్కువెళ్ళి తలంటోసేసిందట. ఆవిడ సప్తఋషుల్నీ రెక్కపుచ్చుకులాక్కొచ్చి 'వెర్రి నాయన్లారా ఆ గడ్డాలూ మీరు మిమ్మల్ని చూస్తే నాకు ఏడుపొస్తోంది. వుండండి శుభ్రంగా తలంట్లోస్తాను–' అని తలంట్లు పోసి సాంబ్రాణి పొగవేసి చెరో మినప సున్ని వుండ చేతిలో పెట్టి వాళ్ళని పైకి పంపించెయ్యగలదు.

అసలన్నిట్లోకి కుక్కకి తలంటొయ్యడం చాలాకష్టం– అన్నట్లు అదిగో మావారొస్తున్నారు. అడిగిన వరాలిచ్చేసి వారిని తలంటుకు కూచోపెట్టాలి. ఎవర్రా అక్కడ – కుంకుడు కాయలు కొట్టండి!

# శివం - శైశవం

**పి**ల్లల్ని 'వాచ్' చేస్తూంటే వాళ్ళు 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్స్'లానూ 'డింగ్ డాంగ్ బెల్లు'లానూ కాక 'లిటిల్ స్వప్నద్రల్సు'లా కనిపిస్తారు. చుట్టూ వున్న ప్రపంచంలోంచి వారిదైన ప్రపంచాన్ని వాళ్ళు అవలీలగా సృష్టించుకోగల్రు. ఆడవాళ్ళ ప్రపంచంలో పిల్లల ప్రపంచం ఓ భాగం అనొచ్చు. 'ఉడుతల్లారా బుడుతల్లారా అయిదారేడుల పాపల్లారా' అని శ్రీశ్రీ గారు కీర్తించారంటే – పిల్లలు పెద్దలకి కాదు కాదు – లిటిల్ రాస్కెల్సు పెద్ద రాస్కెల్సుకి ఆధ్యాత్మిక గురువులేమోనని అనిపిస్తుంది. జాగర్తగా ఆలోచించే వర్డ్సు వర్త్‌గారు 'చైల్డ్ ఈజ్ ఫాదర్ ఆఫ్ ది మాన్' అన్నారేమో!

మొన్నీ మజ్యు రైల్లో 'నిద్రించు పెట్టె'లోకి ఎక్కగానే మా బెర్త్ మీద అంతా పిల్లలూ తల్లులూ బైఠాయించారు. వాళ్ళని అడిగితే మాకు రిజర్వేషనేవిటి ఏలూర్లో దిగుతాం ఆ తర్వాత మీరు సర్దుకొండి అన్నారు. అన్నవాళ్ళు బెర్తులు కొనుక్కున్నవాళ్ళని బభ్రాజమానుల్లా కట్టి రాజమండ్రిదాకా మీ రెక్కడైనా తలదాచుకొమ్మన్నట్లు నిష్పూచీగా పేచీకి దిగారు. టిక్కెట్ ఎగ్జామినర్ కూడా వాళ్ళ జోలి మీకెందుకు సర్దుకు పొమ్మన్నట్లు 'హి హ్హిహ్హీ' అన్నాడు. సందట్లో సడేమియా అని ఈ మధ్యలోకి మరొ కావిడ వచ్చి పిల్లల్ని అందరిమీదా ఎక్కించి ఇరుక్కుని అక్కడే కూచుంది. ఆవిడగారి ఆడపిల్ల లిద్దరూ ఒక మగపిల్లాడు పెట్టె అంతా తమదే అన్నట్లు సిసింద్రీలు సీమటపాకాయల్లా అల్లరి చేస్తూ అరుస్తూ గీపెడుతూ తిరిగేస్తున్నారు.

రైళ్ళలో ప్రయాణం చేసేవారికన్నా, కంపార్ట్‌మెంట్లలో అవీ ఇవీ అమ్ముకుంటూ తిరిగే వారికి ఎక్కువ తెలివితేటలుంటాయి. ఆ ఇల్లాలు పిల్లల్ని నీటుగా రబ్బరు బొమ్మల్లా ముస్తాబు చేసింది. వరసగా కానుపులేమో చిన్నా చితకా ఒకరికీ మరొకరికీ తేడా అట్టేలేదు. కాస్తావున్న

బాపతేమో కార్నివాల్‌కి వెళ్ళేవాళ్ళలా ముస్తాబు చేసింది. ఆవిడ కూడా గుండ్రంగా బొద్దుగా గుమ్మడి పాదులా వుంది. పిల్లలు తల్లిమీదకు పాకుతున్నారు. మెడబట్టి గుంజుతున్నారు. గారాలుపోతున్నారు. 'మమ్మీ - మమ్మీ' అని గునుస్తున్నారు. అంతకు ముందేవాళ్ళ చేతుల్లో బిస్కట్టు పాకెట్లున్నాయి. ఇంతలో పత్రికలమ్మేవాడు దొంతరగా పుస్తకాల్ని పట్టుకుని వచ్చాడు. అలా దొంతరగా పుస్తకాల్ని పట్టుగుంటూ పత్రికలుపైకి కనపడేలా తిరగడం చాలా కష్టం - దానికీ యమ ప్రాక్టీసు, అన్నిటికన్నా ఓరిమి ముఖ్యం - విసుగు చిరాకు ఎంతమాత్రం కూడదు. పిల్లలంతా పుస్తకాల వాడిని ఆపుజేశారు. ఆవిడ కూడా వెంటనే ఓ 'చందమామ' కాపీకొన్నది. బహుశా ఆ చందమామ కథలు రైల్లో చదువుకుందామని ఆ తల్లి వుద్దేశం కావచ్చు. ఆడపిల్లలిద్దరూ పారిజాతం మొక్కల్లా ఒకేలావున్నారు. చిన్నది మహా చురుకు, ఇద్దరికీ తల్లి నుదురూ, తల్లిముక్కూ, తల్లి చాయ వచ్చాయి. అసలు విగ్రహానికి ఈ బొమ్మలు శాంపిల్సులా వున్నాయి. ఇంత సన్నగా ఇంత నాజూగ్గా ఇంత చలాకీగా వున్న ఈ పసివాళ్ళు ఎలాగూ అలా మదర్లా లావెక్కక మానరుకదా - అంతా జీన్స్ మహత్యం కదా అని అనుకున్నా.

ఆ చిన్నది తల్లి చేతుల్లోంచి ఆ చందమామను లాక్కుంది. అట్ట వూడొస్తుందనుకున్నా - ఆ పుస్తకం కోసం కాచుకుకూచున్న పెద్దపిల్ల దాన్ని గుంజుకోబోయింది. ఇద్దరూ ఆ కొత్త చందమామతో కొట్టుకోబోయారు. తల్లి అడ్డం వెళ్లింది కాని ఆ పుస్తకం వాళ్ళ దగ్గిర్నించి లాక్కోలేకపోయింది. ఇద్దరూ, ముగ్గురు పిల్లలకీ ఆ ఒక్క పత్రికే కావాలి, బొమ్మలు చూడ్డానికి. లాక్కోపోతే గుక్కపట్టి ఏడ్చేస్తున్నారు. ఆవిడ చిరాకు తెచ్చుకోలేదు. ఇదే తండ్రయితే ఆ యిద్దర్నీ చమడాలెక్కదీసును. ముత్యాల్లా వున్న పిల్లలు ఏడ్చి ముఖం అంతా కాటికమయం చేసుకుని, బట్టలు మాపుకుని అంటకుండల్లా తయారయేవారే - ఆవిడ కళ్ళతో, చేతుల్తో సంజ్ఞలద్వారా నచ్చచెప్పబోయింది. పుస్తకం చిరిగిందేమో - తెలీదు. ఆవిడ ఆ పుస్తకం కొనడం అవివేకమైన చర్య - తప్పు చేసిందేమోనని నాకనిపించింది.

ఇంతలో కూల్ డ్రింక్‌లవాడొచ్చాడు. వాడొక బాల్చీలో డ్రింక్ సీసాలు పెట్టుకుని అరుచుకుంటూ అక్కడే తచ్చాడడం మొదలెట్టాడు. పిల్లలు పుస్తకం బల్లకిందకు విసిరేసి కూల్ డ్రింకులవాడికేసి చూసి 'కొనమ్మా' 'నాకు డ్రింకు - నాకు డ్రింకు' అంటూ కొత్త పేచీ మొదలెట్టారు. ఆవిడ వాడ్ని 'స్ట్రా' వుందా అని అడిగింది. 'స్ట్రా' లేదన్నాడు వాడు. 'స్ట్రా' లేదర్రా - స్టేషన్లో రాజమండ్రిలో కొని పెడతానని ఆవిడ తీర్పు చెప్పేసింది. పిల్లలు బిక్కమొగం పెట్టేశారు. ఇక తల్లికీ, కూల్ డ్రింక్‌లమ్మేవాడికీ, పిల్లలకీ మధ్య ముసుగు యుద్ధం ప్రారంభమైంది. ఎవరు నెగ్గుతారా అని చూస్తున్నా. మధ్య మధ్యలో బిస్కట్లు తింటూ చందమామను బల్లక్రిందనుంచి తీసి బొమ్మల్ను చూస్తూ - ఇంటర్వెల్లో మర్చిపోకుండా ఏడుస్తున్నారు - ఏడవాలికదా అని.

ప్రతి ఇంట్లోనూ చిన్నపిల్లకి తల్లిమీద 'హోల్డ్' వుంటుంది. అది పుండులాగా జ్వరం సలిపినట్లు సలుపుతూవుంది. 'స్ట్రా' లేదుకదమ్మా అని తల్లి రూలింగు ఇచ్చినా కొనమని పిల్ల సాధింపు. ఇంతలో బయట కేక. పక్కలైనుమీదకి డీసెలింజను అరుస్తూ రాగానే పిల్లలెక్కడున్నా తల్లిని చుట్టేసుకునేవారు. ఆవిడ కళ్ళు దేవికళ్ళులా పెద్దవి. ఆ కళ్ళే వచ్చాయి పిల్లకి. ఈ మధ్యలో మేంగో జెల్లీవాడొచ్చాడు. పదిరూపాయలిచ్చి తాండ్ర తీసుకుంది.

రామాయణంలో పిడకలవేటలా చిల్లరగొడవ – అమ్మేవాళ్ళు ఎవరూ కొన్నాక చిల్లర లేదు అని పెదవి విరుస్తారు. ప్యాసింజర్లు తమకి బద్ధ శత్రువులనుకుంటారేమో – అమ్మేవాడు కొనేవాడికి సహకరించాలి అనే న్యాయం లేదు. చిల్లర కొరతవల్ల వున్నాయివ్వరు – ఎందుకైనా పనికొస్తుందని పెద్దనోట్లు తీస్తారు. ఆవిడ తమ్ముడోడు కూడా వున్నాడుగాని వాడు అక్కని పిల్లల్నీ వదిలి దూరంగా ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. సిగరెట్ల అలవాటుంది కాబోలు – అక్క కన్ను గప్పి తిరుగుతున్నాడు. పైగా పిల్లలు మేనమామని లెక్క చెయ్యరు.

ఆరెంజి, లిమ్కా, థమ్సప్ అంటూ వాడు మళ్ళీ వచ్చాడు. (రైళ్ళలో డ్రింకులమ్మేవాళ్ళు అవి కూల్‌గా వుండాలి, స్ట్రాలు ఇవ్వాలి అనే మర్యాదలు పాటించరు. కన్స్యూమరు ఇంటరెస్ట్ వాడికేమీ లేదు. పిల్లలేడిస్తే చచ్చినట్టు కొంటారు). ఈ లోపల మీల్స్ టిక్కెట్లవాడొచ్చాడు. వాడి డ్రెస్సూ వాడు వాడ్ని చూస్తే దోకొస్తుంది. పరిశుభ్రత అనేది రైల్వేవాళ్ళు పాటించరు.

ఆ తల్లిచివరికీ ఓడిపోయింది. మూడు సీసాలు కొంది ఇరవై రూపాయలిచ్చి. మారాం చేసి అడిగినపిల్ల రెండు గుక్కలు తాగి చందమామ మీద పడింది. మరోపిల్ల గుక్కపట్టి ఏడుపుకు లంకించుకుంది. పిల్లాడుసీట్ల మధ్యనుంచి పరిగెత్తి ఆడుకుంటున్నాడు. ఎవరూ తాగలేదు డ్రింకులు పేచీలు పెట్టి అడిగారే కాని. ఆ మిగిలిందాన్ని ఆ తల్లీ ఆ తమ్ముడూ తాగాల్సివచ్చింది. తరవాత పిల్లల్ని పై బెర్తుమీద కూర్చోపెట్టి ఆడిస్తున్నారు తమ్ముడూ – అక్కా. ఆ పిల్లలు రైలు ఆగినచోట్లప్లాట్ ఫారమ్‌మీది మనుష్యుల్నీ హాకర్లనీ పలకరిస్తున్నారు ఆడుకుంటున్నారు పేచీ పూచీల్లేకుండా.

ఇంతలో నాకు నిద్ర ముంచుకొచ్చింది. పక్క పరుచుకు వాలాను. మళ్ళీ మెలకువొచ్చింది. చూశాను – ఆ పిల్లలు లేరు ఆ తల్లిలేదు, ఎవ్వరూ లేరు. పెట్టి అంతా నిశ్శబ్దం – ఆ అల్లరి కోలాహలం ఆ చైతన్యం అంతా ఏమీ లేదు.

దృశ్యమాన జగత్తు అంతర్ధానమైపోయి రైలు చప్పుడు మనసును మొత్తసాగింది. ఆ మరో ప్రపంచాన్ని వాళ్ళు వాళ్ళతో తీసుకెళ్ళిపోయి ఈ వృద్ధ ప్రపంచాన్ని మాకు మిగిల్చారు.

చైతన్య ప్రవాహాన్ని తల్లుల్లోనూ పిల్లల్లోనూ మాత్రమే చూస్తాం.

రైలు పెట్టి చల్లగా గడ్డకట్టింది!